సాక్షి
బాపట్ల
గురువారం । 21 । ఆగస్టు । 2025



సబ్ జైలులో ఆకస్మిక తనిఖీ

గురజాల: స్థానిక సబ్‌జైలును డీఎస్పీ బి.జగదీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు.



పైడమ్మతల్లి వార్షికోత్సవం

ముప్పాళ్ల: స్థానిక శ్రీ పైడమ్మతల్లి వార్షిక తిరునాళ్ల బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా విఘ్నేశ్వరుడి పూజలు



సత్తెనపల్లి: గాంధీ చౌక్ విఘ్నేశ్వరుని ఆలయాన్ని బుధవారం పునఃప్రారంభించారు. విఘ్నేశ్వరుడికి వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా రామ సుబ్బారావు



బాపట్ల అర్బన్: పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయం చైర్మన్‌గా బూర్లె రామ సుబ్బారావును నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల సీనియర్ సభ్యులుగా, ఆర్యవైశ్య సంఘం, చాంబర్ ఆఫ్ కామర్స్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులుగా సుబ్బారావు పని చేస్తున్నారు.

టెలికాం ఉద్యోగి దీక్ష విరమణ



తెనాలి రూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ తెనాలి టెలికాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె. పద్మావతి చేపట్టిన నిరసన దీక్షను బుధవారం విరమించారు. 10 రోజులుగా ఆమె దీక్ష చేస్తుండడంతో అఖిల భారత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల నాయకులు గుంటూరు నుంచి తెనాలికి వచ్చారు. దీక్షలో కూర్చున్న ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అధికారుల వద్దకు వెళ్లి ఆమెకు జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని, ప్రైవేటు ఏజెన్సీని తొలగించాలని డిమాండ్ చేశారు. సరిపడా ఉద్యోగులు ఉన్న తెనాలిలో ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వారు అధికారులకు సూచించారు. అనంతరం పద్మావతితో దీక్ష విరమింపజేశారు.

బంగారం వ్యాపారిపై రౌడీషీటర్ దాడి

రూ.4 లక్షలు గుంజుకుని పరారీ


వ్యాపారి రహమాన్

వేటపాలెం: బంగారు వ్యాపారిపై రౌడీషీటర్ దాడి చేసి రూ.4 లక్షలను బలవంతంగా లాక్కున్న ఘటన అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో బుధవారం చోటు చేసుకుంది. గాయపడిన బంగారు వ్యాపారి చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ, అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. అక్కాయపాలెం లక్ష్మీపురానికి చెందిన రౌడీషీటర్ మల్లెల రాజేష్ తన వద్ద పాత బంగారం ఉందని, తక్కువ ధరకు అమ్ముతామని సెల్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఉంచాడు. విజయవాడకు చెందిన బంగారు వ్యాపారి రహమాన్ ప్రకటన చూసి రాజేష్‌కు ఫోన్ చేశాడు. దీంతో లక్ష్మీపురం రావాలని రహమాన్‌కి చెప్పాడు. ఇది నమ్మిన అతడు బంగారం కొనుగోలు కోసం లక్ష్మీపురంలోని రౌడీషీటర్ ఇంటికి వచ్చాడు. వెంటనే వ్యాపారిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.4 లక్షలను రాజేష్ లాక్కున్నాడు. అక్కడ నుంచి తప్పించుకొన్న వ్యాపారి చీరాల ఏరియా వైద్యశాలకు చేరి ఫిర్యాదు చేశాడు. రౌడీ షీటర్‌పై అనేక పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయి.

డీఏ బకాయిల కోసం హైకోర్టులో పిటిషన్

మాచర్ల రూరల్: ఉద్యోగులకు డీఏ బకాయిల మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సాంబేలు శాంతిబాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏల కోసం అసోసియేషన్ తరఫున ఈ నెల 14న హైకోర్టులో పిటిషన్ వేసినట్లు ఆమె చెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర దాటుతున్నా టీఏ, డీఏలను చెల్లించటంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ హైకోర్టును ఆశ్రయించామని ఆమె తెలిపారు.

ఐటీఐ ప్రవేశాల దరఖాస్తుకు 26 వరకు గడువు

తెనాలి అర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీలోపు వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాల్లో 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు ఈ నెల 29, 30వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ నంబర్ 93914 02683లో సంప్రదించాలని సూచించారు.


దివ్యాంగుడు
మున్నంగి శ్రీనివాసరావు


90 శాతం వికలత్వం సర్టిఫికెట్

భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన మున్నంగి శ్రీనివాసరావు వయస్సు 58 సంవత్సరాలు. ఉన్నట్లుండి పక్షవాతానికి గురయ్యాడు. కాళ్లు పూర్తిగా చచ్చుబడి మంచం నుంచి లేవలేని స్థితి. వేరొకరి సహాయం లేకుండా మలమూత్ర విసర్జన పూర్తి చేయలేని పరిస్థితి. 2019 డిసెంబర్‌లో బాపట్ల ఏరియా ఆసుపత్రిలో చూపిస్తే 90 శాతం వికలత్వం సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటినుంచి దివ్యాంగుల పింఛన్ ఇస్తున్నారు. శ్రీనివాసరావుకు ఇదే ఆసరా. వారం కిందట పింఛన్ తొలగించామంటూ అధికారులు నోటీసు ఇచ్చారు. దీంతో శ్రీనివాసరావు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒక్క వెల్లటూరు గ్రామంలోనే 57 మంది పింఛన్ దారులకు ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది.


అడపా కృష్ణారెడ్డి


82 శాతం వికలత్వం సర్టిఫికెట్

పర్చూరు మండలం రమణాయపాలేనికి చెందిన అడపా కృష్ణారెడ్డికి 82 ఏళ్లు. వెన్నుముకలో సమస్య తలెత్తి రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. నాలుగడుగులు వేయడమే కష్టంగా మారింది. వేరొకరి సహాయం లేకుండా మలమూత్ర విసర్జన పూర్తి చేయలేని స్థితి. చీరాల ఏరియా ఆస్పత్రిలో 82 శాతం వికలత్వం సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ ఇస్తోంది. మూడు రోజుల కిందట అధికారులు వచ్చి ఇకనుంచి నీకు పింఛన్ ఇవ్వడం లేదని నోటీసు ఇచ్చి వెళ్లారు. ఎందుకని అడిగితే 'నీ వికలత్వం 40 శాతం లోపే' ఉందన్నారు. ఏమి చేయాలో పాలుపోక కృష్ణారెడ్డి ఆవేదన చెందుతున్నాడు.

వికలత్వంపై ఝుళిపించెన్

- కనికరం చూపని బాబు సర్కార్
- జిల్లావ్యాప్తంగా 3,829 దివ్యాంగ పింఛన్లు తొలగింపు
- అనారోగ్య పింఛన్లలోనూ కోత
- వైకల్యం లేదన్న సాకుతో నోటీసులు
- కొత్తవి ఇవ్వకపోగా పాత వాటిని తొలగిస్తున్న ప్రభుత్వం
- లబోదిబోమంటున్న దివ్యాంగులు
- సర్కార్ తీరుపై సర్వత్రా విమర్శలు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో పలు అనారోగ్యాలకు గురై వికలత్వంతో దివ్యాంగుల పింఛన్ పొందిన వేలాది మందిని ప్రభుత్వం నిర్దయగా తొలగిస్తోంది. వికలత్వం లేదంటూ సాకు చూపి నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల నుంచి పింఛన్లు ఇచ్చేదిలేదంటూ అధికారులు తేల్చి చెబుతున్నారు. సదరం సర్టిఫికెట్లలో 90 శాతం వికలత్వం ఉన్నవారి పింఛన్లుసైతం తొలగిస్తున్నారు. నడవలేని, లేవలేని, మంచంలోనే బతుకు వెళ్లదీస్తున్న వేలాది మంది పింఛన్లను దుర్మార్గంగా తొలగిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే 40 శాతం లోపే వికలత్వం ఉందంటూ సాకులు చెబుతున్నారు.

స్థానిక నేతల సిఫార్సుతో తొలగింపు

కొందరు వైఎస్సార్ సీపీకి మద్దతు పలికారంటూ స్థానిక నేతల సిఫార్సుతో పింఛన్లు తొలగిస్తున్నట్లు ఆరోపణ ఉన్నాయి. జిల్లాలో 24,660 దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. ఇందులో వారం రోజుల్లోనే 3,829 మందికి నోటీసులు ఇచ్చి తొలగించారు. మరికొన్నింటిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. అనారోగ్యం బారినపడి మంచంలో మగ్గుతున్న పింఛన్ దారులు 643 మంది ఉన్నారు. అటువంటి వారికి సైతం నోటీసులు జారీ చేశారు.

మండిపడుతున్న దివ్యాంగులు

ఎన్నికల సమయంలో అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే మాట మార్చారు. ఏరు దాటాక బోడి మల్లన్న చందంగా వేలాది పింఛన్లు తొలగించడంపై వృద్ధులు మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఓట్లేయించుకొని ఇప్పుడు ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని పింఛన్ దారుల కుటుంబ సభ్యులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ ఇప్పిస్తామంటూ వసూళ్లు

జిల్లాలో వెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వం దివ్యాంగులకు చెందిన వేలాది పింఛన్లు తొలగించిన విషయం తెలుసుకున్న పచ్చ నేతలు వసూళ్లకు దిగారు. అడిగినంత పైకం ముట్టజెపితే కొత్తగా సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ బేరం పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పింఛన్ నోటీసులు అందుకున్న వారి ఇళ్లకు వెళ్లి రూ. 30 నుంచి 40 వేలు ముట్టజెబితే పింఛన్ వచ్చేలా వికలత్వం పర్సెంటేజీతో సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ బేరాలకు దిగారు. వేమూరు, రేపల్లె, పర్చూరు ప్రాంతాల్లో పచ్చనేతలు ఈ తరహా వ్యాపారానికి దిగినట్లు ఆ పార్టీ వర్గాల నుంచే సమాచారం. ఉన్న పింఛన్లు తొలగించి, తిరిగి ఇప్పిస్తామని బేరాలకు దిగడంపై వృద్ధుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డ్రగ్స్ ముప్పు నుంచి యువతను కాపాడుదాం

ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్



బాపట్ల: డ్రగ్స్ ముప్పు నుంచి యువతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్ తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణ, నివారణ చర్యలపై సమన్వయం కోసం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ మత్తు పదార్థాల ముప్పు నుంచి యువతను రక్షించడం అందరి ప్రధాన బాధ్యతగా భావించాలని చెప్పారు. ప్రతి శాఖ ఒకే దిశలో కృషి చేస్తేనే ఫలితం వస్తుందని తెలిపారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలతో పాటు హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, సోషల్ వెల్ఫేర్ విభాగాలు కూడా చురుకుగా పని చేయాలని ఆయన సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్కూల్-కాలేజీల్లో జాగృతి సదస్సులు నిర్వహించాలని చెప్పారు. మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టడంలో సామాజిక, స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు ఇంటిలిజెన్స్ బ్యూరో అదనపు ఎస్పీ బి. ఫణిరాజు శర్మ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యాప్తి యువత జీవితాలను నాశనం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైన్లు, బస్ స్టాండ్లు, పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని తెలిపారు. గంజాయి తరలింపు, సరఫరాపై కఠిన నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే వలసలపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గ్లోరియ, చంద్రశేఖర్, రామలక్ష్మి, మెజిస్టీరియల్ సూపరింటెండెంట్ మల్లికార్జున రావు, క్రైమ్ డీఎస్పీ జగదీష్ నాయక్, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, అధికారులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: స్థానిక సూర్యలంకలో వచ్చే నెలలో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో బీచ్ ఫెస్టివల్‌కు సూర్యలంక వేదిక కానుందని పేర్కొన్నారు. ఈ ఏర్పాట్లపై బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పర్యాటక, సాంస్కృతిక, వినోద అంశాలను జోడించి, జిల్లా ప్రత్యేకతను చాటేలా ఈ వేడుకలు ఉండాలని ఆయన సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సూర్యలంక జాతీయ, అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలిచిపోతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టూరిజం రీజినల్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న, ఇన్‌చార్జ్ జేసీ గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియా, డెప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏవో మల్లికార్జున,మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాల సందడి

బీచ్‌లో మూడు రోజుల పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, బీచ్ క్రీడలు, సంగీత నృత్య వినోదం, ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు సందర్శకులను అలరించనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 27న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూర్యలంక బీచ్‌కు రానున్నారు. అదే రోజు రూ.97 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

కృష్ణమ్మ ఆగ్రహం.. తగ్గని ప్రవాహం

- నదిలో ఉధృతంగా వరద
- దిగువకు 4.69 లక్షల క్యూసెక్కులు విడుదల
- లంక గ్రామాలకు తప్పని ప్రమాదం


పెసర్లంక అరవింద వారధి వద్ద వరద ప్రవాహం


ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంక అంచులకు చేరిన వరద నీరు

కొల్లూరు : కృష్ణా నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు వచ్చి చేరుతోంది. సముద్రంలోకి విడుదల చేస్తున్నా నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం ఉదయం ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 4.69 లక్షల క్యూసెక్కులను అధికారులు విడుదల చేశారు. దీంతో కొంతమేర నీటి ప్రవాహం తగ్గి, సాయంత్రానికి 4.56 లక్షల క్యూసెక్కుల వరద నీరు నదిలో ప్రవహిస్తోంది.

గ్రామాలను చుట్టుముట్టిన వరద నీరు

వరద నీరు గ్రామాలను చుట్టుముట్టింది. మండలంలోని పెసర్లంక అరవిందవారధి వద్దనున్న నక్కపాయ గండి, ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంక వద్ద, గాజుల్లంక సమీపంలో నది అంచులకు ప్రవహిస్తోంది. గతంలో పడిన గండ్ల నుంచి వరద నీటి ప్రవాహం లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకొని వెళ్లింది. ఇటుకల తయారీ కోసం తవ్విన భారీ గుంతలు వరద నీటితో నిండిపోయాయి. పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం గ్రామాల చుట్టూ నీరు చేరింది.

ముంపు బారిన పంటలు

మండలంలోని పోతార్లంక, చింతర్లంక గ్రామాల పరిధిలోని పల్లపు ప్రాంత పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. అరటి, కంద, బీర, దొండ వంటి పంటలు స్వల్ప విస్తీర్ణంలో వరద ముంపు బారిన పడ్డాయి. పల్లపు భూముల్లోకి భారీగా వరద నీరు చేరింది. సాగులో ఉన్న పశువుల మేత వరద నీటిలో మునకకు గురైంది.

గ్రామాలకు నిలిచిన రాకపోకలు

మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువన చినరేవులో వరద నీరు లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తోంది. ఈ మార్గంలో పోతార్లంక, తిప్పలకట్ట, కిష్కింధపాలెం, తోకలవారిపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు గాజుల్లంక, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

వరద ప్రభావం కారణంగా మండలంలోని తిప్పలకట్ట సమీపంలో నది అంచున ఉన్న పంట పొలాలు భారీగా కోతలకు గురవుతున్నాయి. ఆ ప్రాంత రైతులు తీవ్ర నష్టానికి గురవుతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని పెసర్లంక, కొల్లూరు కరకట్ట దిగువనున్న నక్కపాయ, గాజుల్లంక, ఆవులవారిపాలెం గ్రామాల పరిధిలోని ఇటుక బట్టీల్లోకి వరద నీటి ప్రవాహం చేరింది. దీంతో ఇటుక రవాణా ఈ ప్రాంతాల్లో స్తంభించింది. తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ జానకీ అమరవర్ధన్‌లు వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. వరద నీటిలో దిగవద్దని, అవసరమైన పక్షంలో పునరావాస కేంద్రాలకు తరలిరావడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

'జీజీహెచ్'లో జీతం.. 'ప్రైవేటు'లో వైద్యం!

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో సీనియర్ వైద్యుల తీరుతో రోగులకు తీవ్ర అవస్థలు

- ప్రభుత్వాసుపత్రిలో అటకెక్కిన వైద్యుల సమయపాలన
- సీనియర్ వైద్యుల సేవల కోసం రోగుల ఎదురుచూపులు
- జూనియర్లే అన్నీ చూస్తున్నా పట్టించుకోని అధికారులు
- మొక్కుబడి తనిఖీలతో గాడి తప్పిన ఆస్పత్రి నిర్వహణ
- 'స్పందన'లోనూ ఈ అంశాలపైనే బాధితుల ఫిర్యాదు

ఉమ్మడి ఏపీలో పేదల పెద్ద ఆసుపత్రిగా పేరొందిన గుంటూరు జీజీహెచ్‌లో రోగులు వైద్యుల కోసం ఎదురు చూపులు చూడాల్సి వస్తోంది. ముఖ్యంగా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల కోసం ఏడు జిల్లాలకు చెందిన రోగులు రోజూ గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నారు. ఎంతో వ్యయప్రయాసలతో చికిత్స కోసం వచ్చే పేద రోగులపై సీనియర్ వైద్యులు చిన్నచూపు చూస్తున్నారు. వారు జీజీహెచ్‌లో జీతాలు తీసుకుంటూ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు చేస్తున్నారు. రోగులకు జూనియర్ వైద్యులే పెద్ద దిక్కుగా మారుతున్నారు.


ఓపీ విభాగం వద్ద రోగులు

గుంటూరు మెడికల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుంటూరు జీజీహెచ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండాలి. అవుట్ పేషెంట్ విభాగం (ఓపీ) రోగులకు సేవలు అందించాల్సి ఉంటుంది. వైద్యులకు బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ సమయపాలన పాటించడం లేదు. సీసీ కెమెరాలు ఉన్నా వైద్యులు ఆసుపత్రికి వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసి గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు ఆసుపత్రులకు, సొంత క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. జీజీహెచ్‌లో ఉండాల్సిన సమయంలో 'ప్రైవేటు' వైద్య సేవల్లో తరిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ సేవలు అందించి, గంట సేపు భోజన విరామం తీసుకున్న తరువాత మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వార్డుల్లో బెడ్‌సైడ్ టీచింగ్ చేస్తూ రోగులను చూడాల్సి ఉంటుంది. కానీ కొంత మంది సీనియర్ వైద్యులు ఓపీలోనే జూనియర్ వైద్యులకు పాఠాలు చెబుతూ రోగులను వేచి ఉండేలా చేస్తున్నారు. మరికొంత మంది విభాగాధిపతులు ఓపీలకు రాకుండా వార్డుల్లో ఉంటూ సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. నిబంధనల ప్రకారం విభాగాధిపతులు కూడా ఓపీలకు హాజరై రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. సీనియర్ వైద్యులు, విభాగాధిపతులు ఓపీలకు హాజరు కాకపోవడంతో జూనియర్లు తమకు తోచిన వైద్యం చేస్తూ నెట్టుకొస్తున్నారు. దీని వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలు అందక రోగులు పలుమార్లు ఆసుపత్రికి రావాల్సి వస్తోంది.

తనిఖీలు శూన్యం

ఆసుపత్రిలో ఓపీ పనివేళల్లో సీనియర్ వైద్యులు విధుల్లో ఉన్నారా? లేదా? రోగులు వైద్య సేవలు పొందేందుకు ఏమైనా ఆటంకాలు ఎదురవుతున్నాయా? అనే విషయాలు పరిశీలించేందుకు రోజూ జీజీహెచ్ అధికారులు, వైద్య కళాశాల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేయాల్సి ఉంటుంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తామాలజీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, పీడియాట్రిక్స్, రేడియాలజీ వంటి స్పెషాలిటీ వైద్య సేవలతోపాటు కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, క్యాన్సర్ వంటి సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవల కోసం రోజూ 3 వేల నుంచి 4 వేల మంది రోగులు జీజీహెచ్‌కు వస్తున్నారు. రోగులు పెద్ద ఆసుపత్రిపై ఎంతో నమ్మకంతో వస్తుంటే, సీనియర్ వైద్యులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన ఆసుపత్రి, వైద్య కళాశాల అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలతో కాలయాపన చేస్తున్నారు.

రోగుల ఆవేదన

జీజీహెచ్‌కు సుదూర ప్రాంతాల నుంచి చికిత్సకు వస్తున్నామని, పెద్ద సార్లు అందుబాటులో ఉండకపోవడం వల్ల పలుమార్లు రావాల్సి వస్తోందంటూ పలువురు రోగులు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్సులో లిఖితపూర్వకంగా తెలియజేసినా ఫలితం లేదు. వైద్యుల పనితీరును పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎందుకు మిన్నకుండిపోతున్నారో అర్థంకాక రోగులు తలలు పట్టుకుంటున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, కలెక్టర్ జీజీహెచ్ వైద్యుల సమయపాలనపై దృష్టి సారించాలి.

చీరాలను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి


మద్దతు తెలుపుతున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల: జిల్లా కేంద్రంగా చీరాలను ప్రకటించాలని కోరుతూ చేపట్టనున్న కార్యక్రమానికి మద్దతు ప్రకటించాలని చీరాల జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ తాడివలస దేవరాజు బుధవారం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు. ఎన్ఆర్‌పీఎం హైస్కూలులో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి, అందరి మద్దతు కోరారు. బాపట్ల జిల్లాను దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జిల్లాగా పేరు మార్చాలని, చీరాలను జిల్లా కేంద్రంగా చేయాలనే ప్రతిపాదనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, సురేష్, ప్రసాద్, మురళి, శ్రీరామ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించడానికి ఈనెల 29న జిల్లా పునర్విభజన మంత్రుల కమిటీ రానుంది. ఈ నేపథ్యంలో చీరాల కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు రాజకీయ పార్టీలు, వ్యాపార సంఘాలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులంతా వచ్చి అర్జీల రూపంలో అందించాలని దేవరాజ్ కోరారు.

అబాకస్ పోటీలలో బాపట్ల విద్యార్థుల ప్రతిభ



బాపట్ల అర్బన్: జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో బాపట్లకు చెందిన యూసిమాస్ విద్యార్థులు సత్తా చాటారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాపట్ల నుంచి యూసిమాస్ విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి స్టేజ్ మీద బాపట్ల పేరును మారు మోగించారు. బాపట్ల కు చెందిన మంతెన కృతిక్ జాతీయస్థాయిలో నాలుగో స్థానం, దర్శి చేతన శేష ఆర్యాహి, భమిడిపల్లి శ్రీ వైష్ణవి ఆరవ స్థానంలో నిలిచి మెరిట్ ట్రోఫీలను కైవశం చేసుకున్నారు. యూసిమాస్ సంస్థ బాపట్ల డైరెక్టర్లు వనమా స్మైలీ, బొనిగల రాజేంద్రప్రసాద్‌లను పలువురు అభినందించారు.

ఉరి పెట్టుకుని యువకుడు ఆత్మహత్య



రేపల్లె : మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే మనస్తాపంతో ఉరి పెట్టుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేపల్లె పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం .. మూడవ వార్డుకు చెందిన కోనేటి రాజేష్ కుమార్ (34), లావణ్యలకు 11 సంవత్సరాల కిందట వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసైన రాజేష్ కుమార్ డబ్బులు కోసం తరచూ భార్యను వేధిస్తూ ఉండేవాడు. బుధవారం మద్యానికి డబ్బులు అడగగా భార్య లేవని చెప్పడంతో చనిపోతానని బెదిరించాడు. అన్నట్లుగా మధ్యాహ్నం ఇంటిలో ఫ్యానుకు ఉరి పెట్టుకొని మృతి చెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీ ఫార్మసీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాలపరిమితి గల డీఫార్మసీ కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును సాంకేతిక విద్యాశాఖ ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జాస్తి ఉషారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ రెగ్యులర్, దూరవిద్య ద్వారా బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థినులతో పాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు నుంచి తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని తెలిపారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా అడ్మిషన్ ఫీజులో మినహాయింపుతోపాటు ఉపకార వేతనాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, దరఖాస్తు రుసుం రూ.400తో కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 92471 20305, 98480 38769 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు


జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

చీరాల అర్బన్: మున్సిపల్ రంగ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు ఐక్య పోరాటాల ద్వారానే పరిష్కారం సాధ్యమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్‌జే రంగనాయకులు బాపనమ్మ కల్యాణ మండపంలో బుధవారం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన మహాసభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాప కింద నీరులా వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ముందుకు తెస్తోందని తెలిపారు. దీని వల్ల కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర నష్టాన్ని చవి చూస్తారని చెప్పారు. గతంలో కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి కార్మికులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టాయని విమర్శించారు. ఉద్యోగాలను శాశ్వతం చేయడం, సమాన పనికి సమాన వేతనం, చట్టబద్ధ సౌకర్యాలు అమలు, రిటైర్మెంట్ ప్రయోజనాల హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికులంతా రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. మణిలాల్, ఉపాధ్యక్షుడు ఎం.వసంతరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కె.సామ్రాజ్యం, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్.బాబూరావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ ఎలిజిబెత్, నెల్లూరు డివిజన్ కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ


మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ, చేనేత సంఘం నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవర్ లూమ్స్, జెట్ లూమ్స్‌లకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తూ చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్నాయని, ఈ అంశాలను అక్టోబర్ 6, 7 తేదీలలో సత్తెనపల్లిలో జరిగే చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 11వ మహాసభలో చర్చించి పోరాటాలకు పిలుపునిస్తామని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ హెచ్చరించారు. సత్తెనపల్లిలో బుధవారం జరిగిన చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా శివ దుర్గరావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ చేనేతపై ఉన్న జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ రాష్ట్ర మహాసభలలో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీర బ్రహ్మం, కమిటీ సభ్యులు బిట్రా పానకాలు, పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోవ్, గనికపూడి యేసు రత్నం, వలపర్ల చిన్న దెబ్బయ్య, మోపత్తి బాబు రాజు పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

గుంటూరు లీగల్ /చేబ్రోలు : మైనర్ కిడ్నాప్, హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1,100 జరిమానా విధిస్తూ గుంటూరు నాలుగవ అదనపు జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి శరత్ బాబు బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... గతేడాది జూలై 15వ తేదీన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసి, హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన నరమామిడి నాగరాజు కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలులో నివాసం ఉండేవాడు. బాలిక తల్లి ఎస్తేరు రాణితో నాగరాజు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ సంబంధం బెడిసికొట్టిన తర్వాత ప్రతీకారంతో బాలికను తన ఇంటికి తీసుకువెళ్లి గొంతు నులిమి, హత్య చేశాడు. మృతురాలి తండ్రి పేరుపోగు దావీదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును తెనాలి ఎస్‌డీపీఓ బి.జనార్దనరావు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు నిర్వహించారు. న్యాయస్థానంలో నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణతో కేవలం ఏడాదిలోనే న్యాయస్థానంలో నిందితుడికి కఠిన యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ మేరకు బుధవారం నాలుగవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శరత్‌బాబు తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ, సీసీఎస్ పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గుండెపోటుతో తుళ్లూరు ట్రాఫిక్ ఏఎస్ఐ మృతి



తాడికొండ: గుండెపోటుతో ట్రాఫిక్ ఏఎస్ఐ మృతి చెందిన ఘటన తుళ్లూరులో జరిగింది. ఇక్కడ ట్రాఫిక్ ఏఎస్ఐగా పనిచేస్తున్న రవీంద్ర (55) విధులు ముగించుకొని కారు నడపుతూ వెళుతుండగా తుళ్లూరు శివారు సాయిబాబా ఆలయం వద్దకు రాగానే గుండెపోటుకు గురయ్యారు. కారును రోడ్డుపైనే నిలిపి పక్కకు పడిపోయారు. ఉన్నట్టుండి కారు నిలిచిపోవడంతో సమీపంలో ఉన్న ఏపీఎస్పీ సిబ్బంది కారు అద్దాలు పగలగొట్టి రవీంద్రను బయటకు తీసి తుళ్లూరు పీహెచ్‌సీకి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో పారాణి ఆరకముందే ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లికి చెందిన రంగనాయకమ్మ (24)కు ఈ నెల 17వ తేదీన ఉండవల్లి సెంటర్‌లో నివాసం ఉంటున్న జితేంద్రతో వివాహం చేశారు. బుధవారం జితేంద్ర తన భార్య ఉన్న గదిలో నుంచి బయటకు వచ్చాడు. పది నిమిషాల అనంతరం తిరిగి లోనికి వెళ్లేందుకు రాగా గదికి గడియ పెట్టి ఉంది. ఎన్నిసార్లు తలుపులు కొట్టినా తీయకపోవడంతో అత్తకు చెప్పాడు. ఆమె పిలిచినా రంగనాయకమ్మ స్పందించలేదు. పక్కింటి వారి సహాయంతో జితేంద్ర తలుపులు పగలగొట్టగా.. రేకుల గదిలోని ఇనుప రాడ్‌కు చున్నీతో రంగనాయకమ్మ ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దించి వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏడాదిగా రంగనాయకమ్మకు కడుపునొప్పి ఉండడం వల్లే వివాహానికి నిరాకరించిందని, దానివల్లే ఆత్మహత్య చేసుకుందని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

వ్యవసాయ మెగా క్రెడిట్ ఔట్ రీచ్ క్యాంపు

కొరిటెపాడు: జిల్లాలో వ్యవసాయ మెగా క్రెడిట్ ఔట్ రీచ్ క్యాంప్ 'లక్ష్య', ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సాచురేషన్ క్యాంపు (జనన సురక్ష క్యాంప్)ను నగరంపాలెంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. క్యాంపును కడప రీజియన్ రీజినల్ హెడ్ ఈ. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య, ఫైనాన్షియల్ ఇంక్లూజ్ సాచురేషన్ క్యాంపునకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. క్రెడిట్ క్యాంపెయిన్ సమయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, సీకేసీసీ రుణగ్రహీతలకు రుణాలు మంజూరు చేశామని తెలిపారు. కండ్లకుంట బ్రాంచ్ హెడ్ అశోక్‌కుమార్, సిబ్బందితోపాటు ఏపీఎం, ఇతర సీసీఏలు ఈ క్యాంపులో పాల్గొన్నారని చీఫ్ మేనేజర్ బి.కె.ప్రసాద్ తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి


పంటను పరిశీలిస్తున్న ఏడీఏలు సునీత, రామకోటేశ్వరి

పొన్నూరు: సాగులో రసాయన ఎరువులను తగ్గించాలని గుంటూరు బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్ ఏడీఏ సునీత రైతులకు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్డిముక్కల, ఆలూరు గ్రామాల్లో స్థానిక ఏడీఏ రామకోటేశ్వరితో కలిసి ఆమె పంట పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ జీవన ఎరువులైన పాస్ఫరస్ సాల్యుబ్ లైజింగ్ బ్యాక్టీరియాను (పీఎస్‌బీ)వినియోగించడం వలన పొలంలో భాస్వరాన్ని కరిగించి పంటకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీని వల్ల ఎరువుల వినియోగం తగ్గించవచ్చని అన్నారు. ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ నగదు జమ కానివారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ పి. ప్రసాద్, ఎంపీఈఓ ఎస్. సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

గీత కులాలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో గీత కులాలకు కేటాయించిన బార్లకు గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు బుధవారం విడుదల చేశారు. జిల్లా పరిధిలోని గుంటూరు నగరపాలక సంస్థలో గౌడకు 4, గౌడ్ 2, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లో గౌడకు 2, తెనాలి మున్సిపాలిటీ పరిధిలో గౌడకు, గౌడ్‌కు ఒకటి చొప్పున బార్‌లు కేటాయించడం జరిగిందన్నారు. ఆయా వర్గాలకు కేటాయించిన షాపుల్లో వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29వ తేదీ దరఖాస్తులు స్వీకరిస్తామని 30న లాటరీ ద్వారా కేటాయింపు ఉంటుందన్నారు.

డాక్టర్ విశ్వేశ్వరరావుకు బంగారు పతకం



తెనాలిరూరల్: పట్టణ బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు దివంగత డాక్టర్ కొత్త రవీంద్రబాబు స్మారక ధార్మిక బంగారు పతకాన్ని గుంటూరుకు చెందిన ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావుకు బహూకరించారు. ఈ సందర్భంగా 'కామన్ యూరలాజికల్ ప్రాబ్లమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ గైడ్‌లైన్స్'పై డాక్టర్ విశ్వేశ్వరరావు ప్రసంగించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ మధుప్రభాకర్ బాబు, డాక్టర్ కె. శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కొత్త రవీంద్రబాబు కుటుంబసభ్యులు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

25న సీజ్ చేసిన బియ్యానికి వేలం

నరసరావుపేట: ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ అండర్ సెక్షన్ 6ఏ కింద సీజ్ చేసిన 6,453 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సమక్షంలో ఈనెల 25న మరోసారి వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎం.వి.ప్రసాదు బుధవారం పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 12న నిర్వహించిన వేలంలో సరైన ధర రానందున ఈ నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. బహిరంగ వేలం ప్రకటనలోని నియమ నిబంధనల మేరకు ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు.

పోస్టల్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాల్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జాఫర్ సాధిక్ తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు స్కాలర్‌షిప్‌ను తపాలా శాఖ ప్రవేశపెట్టిందన్నారు. తపాలా శాఖ నిర్వహించే ఫిలాటెలి క్విజ్ , ఫిలాటెలి ప్రాజెక్టుల ఆధారంగా ఏడాదికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ పొందవచ్చన్నారు. విద్యార్థి 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలలో చదువుతూ, సంబంధిత పాఠశాలల్లో ఫిలాటెలి క్లబ్ సభ్యులై ఉండాలన్నారు. పాఠశాలల్లో ఫిలాటెలి క్లబ్ లేకపోతే అభ్యర్థి సొంత ఫిలాటెలి అకౌంట్ కలిగి ఉండాలన్నారు. ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని సూచించారు.

అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీలు సీజ్


బల్లికురవ పోలీస్‌స్టేషన్‌కు చేరిన గ్రానైట్ లారీలు

బల్లికురవ: గ్రానైట్ పలకలు, ముడిరాళ్ల పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను మైన్స్, విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం తెల్లవారుజామున బాపట్ల జిల్లా బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డులోని మల్లాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు.

పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఒక ముడి రాయి లోడు లారీ, రెండు గ్రానైట్ పలకల లోడు లారీలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీలో బాపట్ల జిల్లా విజిలెన్స్ ఏడీ రామచంద్ర, ఆర్ఐ రాజు పాల్గొన్నారు. అధికారులు తనిఖీలు చేపడుతున్నారన్న సమాచారంతో అక్రమ రవాణాదారులు ఎక్కడికక్కడ లారీలను నిలిపేశారు. అక్రమ రవాణాతో ప్రతిరోజూ బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీకి భారీగా గండి పడుతోంది.


సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక


ఎంపికైన జట్టుతో హెచ్‌ఎం విజయ, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ సామంతరెడ్డి, శ్రీనివాసరావు, జనార్దన్ రెడ్డి యాదవ్, పీడీలు

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ సీనియర్ విభాగంలో జిల్లాస్థాయి బాలికల జట్టు ఎంపికలు సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగాయి. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో 15 మందిని జట్టుకు, మరో ఐదుగురిని స్టాండ్‌బైకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో పల్లపాడుకు చెందిన సిహెచ్ అనిత, జి.సునందిని, ఎం.శృతి, సిహెచ్ పావని, బి.నందిని, కె.తేజస్విని, కె.చందన, ఇ.చంద్రిక, వి.లిద్య/ఎం.తిరుపతమ్మ, రొంపిచర్లకు చెందిన వి.శ్రీదేవి, పీవీఎస్ చంద్రిక, కొమెరపూడికి చెందిన బి.ప్రసన్న జ్యోతి, వినుకొండకు చెందిన ఆర్.రాగసుధ, క్రోసూరుకు చెందిన కె.దీవెన ఏంజెల్, కేఎల్ఎస్ ప్రవల్లికలు ఉన్నారు. స్టాండ్ బైలుగా బి.శ్రీలక్ష్మి (రొంపిచర్ల), కె.సంజన (బ్రాహ్మణ కోడూరు), పి.శైలజ, జె.ధనలక్ష్మి, కె.తన్మయిసాయి (రామకృష్ణాపురం)లు ఎంపికయ్యారు. ఎంపికైన బాలికలు ఈనెల 30, 31 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ జిల్లా సెక్రెటరీ పి.సామంతరెడ్డి, జాయింట్ సెక్రెటరీ నర్రా శ్రీనివాసరావు, ట్రెజరర్ జనార్దన్ రెడ్డి యాదవ్‌లు పాల్గొన్నారు. ఎంపికలకు సెలక్షన్ కమిటీ మెంబర్లుగా పీడీలు సైదయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బారావులు వ్యవహరించారు. ఎంపికైన బాలికలకు గురువారం నుంచి కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని పాఠశాల హెచ్‌ఎం బి.విజయ తెలిపారు.

పత్తిపై దిగుమతి సుంకం తొలగింపు సరికాదు

నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు



చిలకలూరిపేట: ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే పత్తి మీద అన్ని రకాల సుంకాలను మినహాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటం దారుణమని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మీడియాతో మాట్లాడుతూ ఈ నిర్ణయం పత్తి రైతులకు మరణ శిక్ష విధింపుతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఇది రైతు వ్యతిరేక చర్య అని ఖండించిందని వెల్లడించారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని తొలగించే ప్రభుత్వ నోటిఫికేషన్ పత్తి రైతులపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశంలో పండించే పత్తి ధరపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. దేశీయంగా పండించే పత్తి ధర ఖచ్చితంగా తగ్గుతుందని, రైతులు మరింత అప్పుల పాలవుతారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం క్వింటా పత్తికి రూ.10,075 రావాలని, కానీ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7,710 మాత్రమే ఉందని వెల్లడించారు. ఆ ధరకు కూడా పత్తి అమ్ముడుపోవడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో దిగుమతి సుంకం ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పత్తి రైతులకు తీవ్రంగా నష్టపరుస్తుందన్నారు.

■ గత సంవత్సరం పండించిన పొగాకును సరైన ధరకు కొన్నవారే లేరని, ఇప్పటికీ సగం పొగాకు రైతులు వద్ద మిగిలిఉందని చెప్పారు. కంపెనీల చేత పొగాకుని ప్రభుత్వం కొలిపించలేకపోయిందని విమర్శించారు. రైతుల ఆందోళనలతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ సంస్థను పొగాకు కొనటానికి ఏర్పాటు చేసినప్పటికీ మార్క్ ఫెడ్ సంస్థ పొగాకును పూర్తిగా కొనలేదన్నారు.

■ మిర్చికి ఖర్చులు, తెగుళ్లు ఎక్కువగావటమే కాకుండా ధర కూడా పడిపోయిందన్నారు. ఇలాంటి స్థితిలో ఏ పంట వేయాలో తెలియనటువంటి తీవ్ర గందరగోళంలో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పత్తి దిగుమతులను ఆహ్వానించటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఆవుల వెంకటేశ్వర్లు మృతదేహం

వెల్దుర్తి: స్కూల్ బస్సు.. ద్విచక్రవాహనం ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతిచెందిన సంఘటన మండలంలోని మండాది గ్రామ సమీపంలోని కానాగు వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. మండలంలోని రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్వర్లు (28) రచ్చమల్లపాడు నుంచి మాచర్లకు వస్తుండగా , మాచర్ల పట్టణానికి చెందిన సెయింటాన్స్ స్కూల్ బస్సు విద్యార్థులను మండాది గ్రామంలో వదిలిపెట్టేందుకు వస్తోంది. ఈక్రమంలో నేషనల్ హైవే 565 కానాగు బ్రిడ్జి మీద స్కూల్ బస్సు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న ఆవుల వెంకటేశ్వర్లు 25 అడుగుల లోతు గల కానాగులో ఎగిరి పడ్డాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన బంధువులు పోలీసులకు సమాచారమందించటంతో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఆరు నెలల కుమారుడు ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు


ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జు అయిన బైక్


మృతి చెందిన దొడ్డా శ్రీను

దాచేపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన దొడ్డా శ్రీను(30) మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మిర్యాలగూడ నుంచి దాచేపల్లి వైపు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ వాహనంలో గామాలపాడుకు చెందిన అన్నదమ్ములైన దొడ్డా సైదులు, దొడ్డా శ్రీను ఉన్నారు. కారు బలంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం కిందపడి శ్రీనుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సైదులు తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన తర్వాత ఈ రెండు వాహనాలు రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన మరో ఆటోను బలంగా ఢీకొట్టాయి. ఆటో బోల్తాపడటంతో అందులో ఉన్న మరో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను పిడుగురాళ్లలోని వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడు శ్రీనుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

నీట్ పీజీ సెట్‌లో డాక్టర్ ప్రవల్లికకు 1820 ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పీజీ-2025 పరీక్షలో పట్టణానికి చెందిన డాక్టర్ ముద్దా ప్రవల్లిక ఓపెన్ క్యాటగిరీలో 1820 ర్యాంక్ సాధించింది. వైజాగ్ ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె నీట్ పీజీ సెట్‌లో 613 మార్కులతో ఉత్తమ ర్యాంక్ సాధించింది. డాక్టర్ ప్రవల్లిక తండ్రి ముద్దా రమేష్ పట్టణంలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తుండగా, తల్లి ఉషారాణి గృహిణి. చిన్న పిల్లలకు వైద్యసేవలు అందించేందుకు తాను పీడియాట్రిక్ విభాగంలో పీజీ చేయనున్నట్టు డాక్టర్ ప్రవల్లిక తెలిపారు.

క్లుప్తంగా

28న విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినం

లక్ష్మీపురం: ఈ నెల 28వ తేదీన విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినాన్ని విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినంగా జరుపుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజానీకంపై భారీ ఎత్తున విద్యుత్ భారాలు మోపిందని, అప్పట్లో వామపక్ష పార్టీల నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త ప్రజా ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్తు చార్జీలు పెంచబోమని, భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ అదనపు భారాలను ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతోను, ట్రూఅప్ చార్జీల పేరుతో మోపిందన్నారు. దీంతోపాటు స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా వేదిక ఆధ్వర్యంలో ప్రతిఘటన ఉద్యమం సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రజానీకం ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ నెల 28వ తేదీన జరిగే ప్రతిజ్ఞ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

25న రజకుల ధర్నాను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: కూటమి నేతలు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు కోసం ఈ నెల 25వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మందూరు వెంకట నరసయ్య గురువారం పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాలను సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేయడం లేదని, మంత్రులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేసి కాలయాపన చేస్తోందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కోండయ్య, సీతయ్య పాల్గొన్నారు.

వినాయకచవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

- ఆన్‌లైన్‌లోనే మండపాలకు అనుమతి
- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



బాపట్లటౌన్: వినాయకచవతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఎస్పీ తుషార్ డూడీ విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు, మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించుకునే భక్తుల సౌకర్యార్థం సులభంగా అనుమతులు పొందేందుకు సింగిల్‌విండో విధానాన్ని పోలీస్ శాఖ ప్రవేశపెట్టిందన్నారు. http://fanerhutrav.net అనే వెబ్‌సైట్‌ను పోలీస్ శాఖ ప్రారంభించిందన్నారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలన్నారు. దరఖాస్తుదారుడు పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. సంబంధిత పోలీస్ అధికారి స్వయంగా పందిరి, మండప స్థలాన్ని తనిఖీ చేస్తారన్నారు. నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) జారీ చేస్తారన్నారు. వినాయక ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతాపరమైన నియమ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో అనుమతి లేకుండా వినాయక మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేయరాదన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ఇలా...

http://fanerhutrav.net వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి దరఖాస్తుదారుడు అతడి ఫోన్ నెంబర్ నమోదు చేయాలి.

- నిర్ధారణ కోసం దరఖాస్తుదారుడు ఫోన్ నెంబర్‌కు ఓ.టి.పి వస్తుంది, దానిని ఎంటర్ చేయాలి. వెంటనే దరఖాస్తు పత్రం వస్తుంది.
- దరఖాస్తు పత్రంలో వివరాలను పొందుపరిచి సబ్మిట్ చేయాలి.
- దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు వెళ్తుంది.
- సంబంధిత పోలీస్ అధికారి పందిరి, మండప స్థలాన్ని తనిఖీ చేస్తారు.
- నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) జారీ చేస్తారు.
- నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాలి.
- పోలీస్ సిబ్బంది సందర్శన సమయంలో కోడ్‌ని స్కాన్ చేసి తనిఖీ చేస్తారు.

నీట్ పీజీలో మెరిసిన పూనూరు విద్యార్థి

జాతీయ స్థాయిలో 3716వ ర్యాంకు కైవసం



ర్యాంక్ సాధించిన శృతి

యద్దనపూడి: మెడికల్ విభాగంలో బుధవారం ప్రకటించిన నీట్ పీజీ పరీక్ష ఫలితాల్లో యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన డాక్టర్ ఐలవరపు శృతి జాతీయ స్థాయిలో 3716వ ర్యాంకును సాధించారు. మొత్తం 2,42,000 మంది అభ్యర్థులు రాసిన నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో శృతి 3716వ ర్యాంక్ సాధించారు. పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసిన శృతి మొదటి నుంచి చదువులో అగ్రగామిగా ఉండేవారు. 2018 నీట్ యూజీ ఎంట్రన్స్ పరీక్షలో రాష్ట్ర స్థాయి మొదటి పది మంది విజేతల్లో ఒకరుగా నిలిచి గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గైనకాలజీ పూర్తి చేయటం ద్వారా పేద ప్రజలకు సేవలు అందించటం తన లక్ష్యమని శృతి తెలిపారు. శృతి తండ్రి హనుమంతరావు ఆరోగ్య శాఖలో ఉద్యోగి కాగా తల్లి హిమబిందు ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు, సోదరి ప్రణయ, పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నీట్ పీజీలో 5850 ర్యాంక్ సాధించిన రాచూరు వాసి



దీవి శ్రీ సాయి హేమంత్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామానికి చెందిన దీవి శ్రీసాయి హేమంత్ నీట్ పీజీ 2025లో 578 మార్కులు 5850 (ఆల్ ఇండియా) ర్యాంక్ సాధించారు. 2018లో నీట్ ఎంట్రన్స్ పరీక్షలో నేషనల్ 20 వేలు, రాష్ట్రంలో 1011 ర్యాంక్ సాధించాడు. గుంటూరు కాటూరి మెడికల్ కాలేజీలో ఉచిత సీట్ పొంది 2018–2024లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. హేమంత్ తండ్రి శ్రీనివాస హరికుమార్ న్యాయవాదిగా, తల్లి అనంత శైలజ సచివాలయ మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. హేమంత్‌ను తాత విశ్రాంత తెలుగు పండిట్ దీవి వేంకట లక్ష్మీ నరసింహాచార్యులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

23 నుంచి గోవాడలో కోటి కుంకుమార్చన





అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడ శైవ క్షేత్రమైన శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర శ్రావణ బహుళ అమావాస్య నుంచి 11 అమావాస్యలు పురస్కరించుకుని కోటి కుంకుమార్చన, సామూహిక లలిత పారాయణ మహోత్సవం జరుగుతుందని కార్యనిర్వాహణాధికారి బి. అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 23న సెప్టెంబర్, అక్టోబర్ 21న, నవంబర్, డిసెంబర్ 19న, 2026 జనవరి 18న, ఫిబ్రవరి 17న, మార్చి 18, ఏప్రియల్ 17న, మే 16న, జూన్ 14న అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ, అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ, ప్రత్తిపాటి రామకోటేశ్వరరావు తెలిపారు. ప్రతి నెలా 10 లక్షల పారాయణ, కుంకుమార్చన, అమ్మవారికి శ్రీ సూక్త సహిత దేవి ఉపనిషత్తులతో అభిషేకం, కుంకుమార్చన, దేవి హోమం, కుష్మాండ పూజ, కూష్మాండబలి పూజా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కోటి కుంకుమార్చన కమిటీ, సహాయకులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

పొగాకు పంటకు ప్రత్యామ్నాయం అపరాలు

ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న ఆత్మ డిప్యూటీ డైరెక్టర్

అద్దంకి: పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేసుకోవాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. 'ఆత్మ' ప్రకాశం జిల్లా సౌజన్యంతో కొంగపాడులో వివిధ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేయాలని సూచించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మురళీధర్ నాయక్ మాట్లాడుతూ మినుము, కంది, పెసర, శనగ పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.ఉష మాట్లాడుతూ అపరాల పంటలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని.. రసం పీల్చే పురుగుల నివారణ కోసం విత్తన శుద్ధి చేయాలని సూచించారు. ఉప్పునీటి యాజమాన్యం శాస్త్రవేత్త కె. మృదుల మాట్లాడుతూ అపరాలు.. మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు గురించి తెలియజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ఎఫ్రాయిం మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం బర్లీ పొగాకు సాగు చేయవద్దని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ రామిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు నర్రా బ్రహ్మానందం, గుడిపూడి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రిస్కిల్ల, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు అందజేస్తున్న బాధిత మహిళలు

రేపల్లె: రేపల్లె పట్టణంలో అధిక వడ్డీలు కట్టాలని వేధింపులకు గురిచేస్తున్న మైక్రోఫైనాన్స్ సంస్థల నుంచి బాధితులకు రక్షణ కల్పించాలని బాధిత మహిళలు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మైక్రో ఫైనాన్స్ సంస్థ ఆఫీసుల ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్.మణిలాల్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఇళ్ల పట్టాల మీద లోన్ ఇస్తామని పేదలను నమ్మించి ఇంగ్లీషులో ఉన్న అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు చేయించుకొని అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు గురిచేస్తున్నారని విమర్శించారు. 12 శాతానికి మించి వడ్డీ వసూలు చేయరాదని నిబంధనలు ఉన్నప్పటికీ 30 శాతం వరకు వసూలు చేస్తూ పేదలను పీడిస్తున్నారన్నారు. రాత్రి ఆరు గంటల తర్వాత లోన్ రికవరీ పేరుతో మహిళలకు ఫోన్ చేసి వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత మహిళలు సింధు దేవి, తిరుపతమ్మ, కృష్ణంరాజు, దుర్గాప్రసాద్, మోషే, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు
- పర్చూరు మార్కెట్ యార్డులోని పొగాకు కొనుగోలు కేంద్రం సందర్శన



కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, అధికారులు

పర్చూరు(చినగంజాం): పొగాకు రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం రైతులందరినీ ఆదుకుంటుందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పర్చూరు మార్కెట్ యార్డు పరిధిలోని నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. గోదాముల్లో నిలువ ఉంచిన పొగాకు పరిశీలించారు. పొగాకు రైతులకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పొగాకును కొనుగోలు చేస్తోందన్నారు. పొగాకు నాణ్యతను బట్టి మూడు గ్రేడులుగా విభజించి రైతులకు గిట్టుబాటు ధలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 7754 మంది రైతుల వద్ద మార్క్‌ఫెడ్ సంస్థ సుమారు రూ.100 కోట్లతో 13100 మెట్రిక్ టన్నులు పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా మేనేజర్‌లు నరసింహ, రమేష, పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు మేలు



భీమవరంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ వెంకట్రావు తదితరులు

మాచవరం : ఉద్యాన పంటల సాగుతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, పిన్నెల్లి, వేమవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. మిరప, జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలను పరిశీలించారు. రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.మిరప, కూరగాయలు, ఆయిల్ పామ్ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ, యాజమాన్యం పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు. ఎండు తెగులు ఆశించిన జామ చెట్లకు 1గ్రా. కార్బెన్‌డజిమ్ లేదా 3గ్రా.కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి చెట్టు మొదట్లో పోయాలని తెలిపారు. జింక్, మెగ్నీషియం ధాతు లోప నివారణకు 2గ్రా. జింక్ సల్ఫేట్, 2గ్రా. మెగ్నీషియం సల్ఫేట్, 10 గ్రా. యూరియా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల హార్టీకల్చర్ ఆఫీసర్ అంజలి బాయి, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ కరుణ కుమారి, ప్రభాకర్ రెడ్డి, సాగర్ బాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ కోసం చట్టం అవసరం

ప్రభుత్వాన్ని కోరిన సంఘ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

నరసరావుపేట: వెనకబడిన తరగతుల(బీసీ)పై రోజురోజుకూ దాడులు, వివక్ష, దౌర్జన్యం, సామాజిక బహిష్కరణకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఏపీ బీసీ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. ట్రియాండ్ సిటీ హోటల్‌లో గురువారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం నాయకుల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక చట్టం వల్ల బీసీలకు రక్షణతో పాటు వారిపై వివక్షను సమూలంగా అరికట్టగలదని నమ్మకం వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ పనుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, అభ్యున్నతి కోసం నియమించిన అన్ని కమిషన్లు రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న బీసీలు సామాజికం, ఆర్థికం, రాజకీయంగా వెనకబాటులో ఉన్నారని పేర్కొన్నాయని తెలిపారు. బీసీ నిరుద్యోగుల కోసం ఎస్సీ, ఎస్టీల మాదిరి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగుల ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకుల విద్యాలయాలు, స్టడీ సర్కిళ్లు, వసతి గృహాలను సకల సౌకర్యాలతో నిర్మించాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొల్లిపర బాలాజీ, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ఈపూరు విద్యుత్ సిబ్బంది సత్తా



టీంను అభినందిస్తున్న ఎస్‌ఈ విజయ్‌కుమార్

ఈపూరు(శావల్యాపురం): రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో ఈపూరు మండల విద్యుత్ సిబ్బంది పల్నాడు జిల్లా టీం తరఫున ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమని నరసరావుపేట ఎస్‌ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో గురువారం పోటీల్లోని విజేతలు పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, కంచర్ల ఏడుకొండలు, సన్నిబోయిన రామాంజినేయులు, అచ్యుత్, మల్లికార్జున్‌లను అభినందించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ అంకితభావంతో విధుల నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించటం ప్రశంసనీయమని తెలిపారు. మానసిక వికాసం, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పిన్నబోయిన వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు క్రీడా దుస్తులు అందజేశారు.

23న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ధర్నా

లక్ష్మీపురం: జీవో నంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా పోస్టర్‌ను గురువారం గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, హాస్టల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సౌమ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం

- రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు అగస్టీన్



మాట్లాడుతున్న అగస్టీన్

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా... ఉన్న దివ్యాంగ పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బొక్క అగస్టీన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో దివ్యాంగ విభాగం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి తర్వాత రాష్ట్ర ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులు గురిచేస్తోందన్నారు. ఎన్నికల హామీలో మాత్రం రూ.6 వేలు పింఛను ఇస్తామని చెబితే సంబరపడ్డామని.. ఇప్పుడు నిర్దయగా తీసేస్తున్నారని మండిపడ్డారు. గతంలో 80 శాతం వైకల్యం ఉంటే ఇప్పుడు 40 శాతం ఉన్నట్లు చూపించి పింఛన్లు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారికి కూడా మొండిచేయి చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో ఆసుపత్రులకు, ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీని వల్ల దివ్యాంగులు కార్యాలయాల మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

నాడు అండగా వైఎస్ జగన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దివ్యాంగులకు అండగా నిలిచారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి తమ కష్టాలను తీర్చారని దివ్యాంగులు పేర్కొన్నారు. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ తీసేయడంతో ఏ పని కావాలన్నా కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వారి కోసం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులతో కలిసి నిరసన చేపడతామన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన విధంగానే దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసరి గణేష్‌బాబు, కొమ్మా లింగరావు, శంకర్, జె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

మద్రిపాలెం (విశాఖ జిల్లా): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఊహించని మలుపు చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారులో గంజాయిని గుర్తించిన పోలీసులు, ఆ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ వెల్లడించారు. ఈ నెల 12న సుభాష్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక కారు ఢీకొని ఏడాదిన్నర చిన్నారి వర్షిత్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత కారు డ్రైవర్, తమిళనాడుకు చెందిన అర్జునన్ జెమినీ ఆర్ముగంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు కారులో ఉన్న మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసులు ఈ నెల 16న సీజ్ చేసిన కారును తనిఖీ చేయగా.. 21 కిలోల గంజాయిని గుర్తించారు. పరారీలో ఉన్న ముగ్గురినీ అరెస్ట్ చేశారు. వారిని హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటున్న గుంటూరుకు చెందిన అక్షయ గౌతమి(20), షేక్ మహమ్మద్ జాకీర్ (19), ఒంగోలుకు చెందిన పెర్లి విజయవర్ధన్ రాజు (25)గా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వీరు విజయవాడలో కారు అద్దెకు తీసుకుని అరకు వెళ్లి గంజాయి కొనుగోలు చేశారు. తిరిగి వస్తుండగా ఊర్వశి జంక్షన్ సమీపంలోని సుభాష్‌నగర్ వద్ద ప్రమాదం జరిగింది. పెర్లి విజయవర్ధన్ రాజుపై ఇప్పటికే ఒంగోలులో 11 కేసులు ఉన్నాయని, మహమ్మద్ జాకీర్‌పై కూడా గంజాయి కేసు ఉందని పోలీసులు వెల్లడించారు. యువతికి తల్లిదండ్రులు లేరు. విజయవర్ధన్‌కు బంధువు కావడంతో అతనితో ఇలా వెళ్తా ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపించిన ఎస్ఐలు షేక్ సమీర్, రవికుమార్‌లను సీఐ అభినందించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

ప్రైవేటు వెంచర్‌లో డస్ట్ అన్‌లోడ్ చేస్తుండగా ఘటన



కార్మికుడి మృతదేహం

తాడికొండ: హై టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం... తాడికొండ అడ్డరోడ్డులోని ఓ ప్రైవేటు వెంచర్‌లో బెంజ్ లారీ నుంచి డస్ట్ అన్‌లోడ్ చేసేందుకు పైనున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తప్పించబోయాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ తగిలినట్లు సమాచారం. ఘటనా స్థలంలోనే కార్మికుడు కుప్పకూలడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు పోలీస్‌స్టేషన్‌కు ఎలాంటి సమాచారం అందలేదు.



ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగెలు